# 2004 డైరీ

**-పావులూరి శివాజీ**

ఒక్క ఐడియా జీవితాన్ని మార్చేస్తుంది అనటం ఎంత నిజమో, ఒక్క ఆలోచన నా భవిష్యత్‌ని మలుపు తిప్పిందన్నది అంతకన్నా ఎక్కువ నిజం! రెండతస్తుల ఫ్లోర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్...సెల్లార్‌లో నాకోసం ఎదురుచూసే బుల్లి మారుతి జెన్...చక్కటి లాభాలు ఆర్జించిపెడుతున్న ఫర్నీచర్ బిజినెస్. నవ్వులు పూయిస్తూ నిరంతరం ధ్యాసలో నాకోసం చక్కటి అనుభూతుల్ని పంచే నా భార్య నిశ్చయ...! ఏ క్షణంలో ఉరిశిక్ష అమలవుతుందోనని ఊపిరితిత్తులు గుప్పిట్లో పెట్టుకుని జైల్లో ఊచలు లెక్కించుకుంటూ కూర్చోవాల్సిన నేను...ఈ రోజు ఇంత బాగా వుండగలిగానంటే అందుక్కారణం నా మాజీ ప్రియురాలు హన్సిపట్ల నేను మార్చుకున్న నిర్ణయమే!

చూపుల్తో కవ్వించి, ఊహల్లో తేలించి...ఊపిరి సలపని బాసలతో ఉక్కిరిబిక్కిరి చేసి...కొత్త గొడుగు కనిపించగానే పాత గొడుగు మడిచేసి...మానసికంగా చిత్తు చేసి...తనని హతమార్చాలన్న ఘాతుకానికి తెరతీసిన వైనం తెలియాలంటే నాలుగు సంవత్సరాలు వెనక్కి వెళ్లక తప్పదు.

మాకు ఊర్లో ఎనిమిదెకరాల పొలం ఉంది. అమ్మ, నాన్న వ్యవసాయం చేస్తుంటారు. నాకు చదువు పెద్దగా అబ్బకపోయినా కంప్యూటర్ నేర్చుకునుంటే ఎందుకో ఒకందుకు ఉపయోగపడుతుందని ఇంట్లో వాళ్లు అంచనా వేశారు. దాంతో ఊరికి దగ్గర్లో వున్న టౌన్‌లో రూమ్ తీసుకుని కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో జాయినయ్యాను. రాకేష్, విశాల్, పాండు నా మిత్ర బృందం. ఆ ముగ్గుర్లో ఇద్దరికి బైక్‌లున్నాయి. ఇన్‌స్టిట్యూట్ టైమింగ్స్ అయిన వెంటనే బైకుల మీద షికార్లు చెయ్యటం మా హాబీ. ముఖ్యంగా అమ్మాయిల కాలేజి దగ్గరే మాకు ఎక్కువ కాలం గడిచేది.

టౌన్‌లో రిలీజైన కొత్త సినిమా మార్నింగ్ షో టికెట్లు సంపాయించటం దగ్గర్నుంచి కాలేజికి కొత్తగా వెళ్లే అమ్మాయిలపైన కామెంట్లు విసరటం వరకు మేమే ముందుండేవారం. ఈ విషయాల్లో ఎవరితోనైనా గొడవపడ్డామంటే అవతలి వాళ్లు మా ధాటికి బేజారెత్తాల్సిందే.

అయితే మాలోనూ ఒక రూలుంది. ఎవ్వరైనా ఒకమ్మాయిని మనస్ఫూర్తిగా ఇష్టపడ్డారంటే మిగతావాళ్లు ఆ అమ్మాయి జోలికి వెళ్లకూడదు.

నేను ఆ కోణంలో ఇష్టపడిందే మా కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌కి కొత్తగా జాయినైన హన్సిక. ఆమె ఫేసే కాదు...నడకలోను ఓ వింత ఆకర్షణ వుంది. ఆమె నొసలు ఎగరేసే తీరు చూస్తే...ఎంతటి మగాడైనా హర్టయిపోవాల్సిందే...ఆమె కూర్చునే పరిసరాలనుండి వచ్చే చల్లటిగాలి ముక్కుపుటాలకి సోకిందంటే మనసులో ఊహలకి కామా వుంటుందేమోగాని, కోమా ఉండదు. ఇన్‌స్టిట్యూట్‌కి నాలో టైమ్ పంక్చువాలిటీ అన్నది ఆమెను చూశాకే మొదలైంది.

వాడి లవర్‌కోసం వాడేవో తంటాలు పడ్తున్నాడు మనకెందుకులే అంటూ రోజూ వెంట వచ్చే ముగ్గురు మిత్రులు నామమాత్రానికి నన్నొదిలేశారు.

మార్కెట్‌లో కొచ్చే ప్రతి కొత్తరకం డ్రెస్ వాడి పడేయటం నాకు మొదట్నుండీ అలవాటు.

రోజుకో డ్రెస్‌లో ఆమెను ఆకట్టుకోవటం మొదలెట్టాను. ఆమె నావంక చూస్తూ కళ్లార్పటం నేను చేసే పనులకి ఎంకరేజింగ్‌గా అన్పించేది. ఇదే వేరొకరి విషయం అయితే పలకరించాలనుకున్నప్పుడు దూకుడుగా మాటలు కలిపుండేవాడ్ని. కాని ఆమెతో నేను కోరుకుంటున్నది జీవితకాలపు అనుబంధం కనుక మా మధ్య ఏర్పడే మొదటి పలకరింపుకి తగిన ఇంపార్టెన్స్ వుండాలి అనుకున్నాను.

ఆరోజు ఇన్‌స్టిట్యూట్‌లోకి అడుగుపెడుతుండగానే మొదలైంది జోరున వాన...కరెంట్ పోవటంతో కంప్యూటర్లన్నీ మూతపడ్డాయి. మా మాస్టర్‌కి అప్పుడే ఏదో గుర్తొచ్చింది. ఇంటిదగ్గర చెయ్యాల్సిన తప్పనిసరి పనొకటి మిగిలిపోయిందంటూ రెయిన్ కోటు వేసుకుని వెళ్లిపోయాడు.

ఉన్నది నేను, హన్సిక మాత్రమే! మనసులో ఉద్వేగాలు బైట పెట్టుకోటానికి అమ్మాయిలకైనా, అబ్బాయిలకైనా ఇంతకన్నా మంచి అవకాశం వుంటుందా...ఆమెతో ఎటువంటి టాపిక్ మొదలు పెట్టాలా అన్న సందిగ్ధంలో మదనపడుతుండగా తనే మాట్లాడింది.

"ఇంత వర్షానికి స్టూడెంట్స్ ఎవ్వరూ రారేమో" అన్నది.

"చెప్పలేం- మనిద్దరం వచ్చాముగా..." అన్నాను.


ఆమె తేలికపాటి నవ్వు పెదవులమీదికి తెచ్చుకుంటూ "మనం వచ్చింది వర్షం రాక ముందు.." అన్నది.

ఇద్దరం ముందు రూమ్‌లో వుండే విజిటర్స్ ఛెయిర్స్‌లో కూర్చున్నాం.

ఇన్‌స్టిట్యూట్ గురించి మొదలైన సంగతులు నెమ్మదిగా పర్సనల్ విషయాల్లోకి మళ్లాయి. ఆ మాటల్లో ఇద్దరి ఊర్లు పక్కపక్కనే కావటం...మరింత చొరవగా మాట్లాడుకునేందుకు దారితీసింది.

తను టౌన్‌లో ఏ వీధిలో వుంటున్నది చెప్పింది. తనతోపాటు రూమ్‌లో మరో ముగ్గురు అమ్మాయిలు వుంటారుట.

వేరే కాలేజిల్లో చదువుతున్నారట. పరిచయమే గగనం అనుకుంటే తన గురించి ఇన్ని వివరాలు చెబుతుండడం నా మనసు గాల్లో తేలిపోతున్నట్టుగా చేస్తోంది. మరో ఇరవై నాలు గ్గంటలు ఆ వర్షం అలాగే కురుస్తూ మేమిద్దరం ఆ హాల్లోనే చిక్కుకుపోతే ఎంత బావుండు అనుకున్నాను. వర్షం తగ్గు ముఖం పడుతుండగా మాస్టర్ వచ్చాడు. స్టూడెంట్స్ ఇద్దరమే కావటంతో నాలుగు పొడి పొడి మాటలు చెప్పి ఆ పూటకి అయిందనిపించాడు.




హన్సికని ట్రాక్‌లోపెట్టిన విషయం నా మిత్రులతో చెప్పాను. వాళ్లు ఇంకొంచెం అడ్వాన్స్ యి చూపులు పరిచయాల వరకు వచ్చాయంటే ఇక లవ్ సక్సెస్ అయినట్టేనంటూ తమ కంగ్రాట్స్ తెలిపారు.

నేను బైక్ నడుపుతానంటే ఆఁ..ఉఁ...అనే రాకేష్ ఇప్పుడు నాకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చాడు.

హన్సిక విషయంలో నేను కోరింది కోరిన ట్టుగా జరుగుతుండటం నాకెంతో ఆనందాన్ని ఆహ్లాదాన్నిస్తోంది. తనకి డబ్బుకన్నా స్నేహం అంటేనే ప్రాణం అన్నది. తనకి మనస్ఫూర్తిగా నచ్చినవాడితోనే భావిజీవితం అన్నది. ఇంతా జరుగుతున్నాక ఆమె మనసులో నేనున్నానో లేదో తెలుసుకోవటానికూడా పెద్ద సమయం పట్ట లేదు. ఓ చల్లని సాయంకాలాన...నా స్వహస్తా లతో ఐ లవ్ యూ అంటూ రాసిన గ్రీటింగ్ ఆమె కందించాను.

ఆమె నా ప్రేమ నంగీకరించింది అని తెలియజెయ్యటానికి ఆ గ్రీటింగ్ చూశాక ఆమె మొహంలో మారుతున్న భావాల గురించి వేరే చెప్పనక్కర్లేదు.

ఆరోజు మా రూమ్‌లో పెద్ద పార్టీ చేశాను. నా మిత్రులు వారికూడా హన్సికని పరిచయం చేయ్యాలన్నారు. తొలిప్రేమ అనుభవాలు ఇంకా పూర్తవ్వకుండానే గర్ల్‌ఫ్రెండ్‌ని తోటివాళ్లకి పరి చయం చెయ్యటమంటే ఎంతమందికి మనసొప్పు తుంది? మా హృదయాల్లోంచి చిగురులు తొడి గిన ప్రేమ మూడు పువ్వులు, ఆరు కాయలుగా

సాగుతోంది. ఇండియన్, చైనీస్ హోటల్స్ రుచులన్నీ తనకి చూపించాను. తన మిత్రురాళ్లు లేని టైం ఆమె రూమ్‌లో టీవి పెట్టుకుని గంటలతరబడి కబుర్లు చెప్పుకునేవాళ్లం...ఆమెను చూడనిదే నాకుగాని, నన్ను చూడందే తనకి గాని పొద్దుపోయేదికాదు.

***

మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం. తన దగ్గరకు వెళ్లే ప్రతిసారి ఫోన్‌లో ఇన్ఫర్మేషన్ ఇచ్చి వెళ్తుండే వాణ్ని. కానీ ఆ రోజెందుకో ఆమెని థ్రిల్ చేయాలనిపించింది. టౌన్‌లో ఓ పేరుమోసిన హోటల్‌నుండి ఫ్యామిలీ ప్యాక్ పట్టుకుని తన రూమ్ కెళ్లాను. అక్కడ వేరే బైక్ పార్క్ చేసి వుండటం చూసి కొద్దిగా తడబడ్డాను.

లోపల ఎవరున్నది తెలీక కొద్దిసేపు సందిగ్ధంలో గడిపి తిరుగుముఖం పడుతుండగా అప్పుడే బయటికొచ్చారు హన్సిక, మరో అతను. ఆ వ్యక్తి నా వయసువాడే. తన రూమ్మేట్ షీలా వాళ్ల అన్నయ్య, పేరు ప్రదీప్ అంటూ హన్సిక అతన్ని పరిచయం చేసింది. డ్రెస్సింగ్, మేకప్, హెయిర్ స్టైల్‌లో నాకంటే కాస్త రిచ్‌గా కనిపించటం నాలో కొంత జెలసీని కలిగించింది పక్కన షీలా లేకుండా ఈమెతో ఎప్పట్నుండో పరిచయం వున్నవాడిలా బిహేవ్ చెయ్యటం నాకు నచ్చలేదు. ఈ విషయం ఇంతటితో తేలిపోతే నాకు పెద్ద బాధ అన్పించేది కాదు.

అతనికి ఆస్ట్రేలియాలో జాబ్ కన్‌ఫర్మ్ అయిందట...! అక్కడికెళ్లేలోపు తన స్నేహితుల్తో కలిసి చెయ్యగలిగినంత ఎంజాయ్‌మెంట్ చేస్తాడట.

అతనితో కలిసి తిరగొద్దని ఎంత చెప్పినా ఆస్ట్రేలియా వెళ్లేవరకు అతని టాపిక్ లేవనెత్తొద్దంటూ తిరిగి నాకే వార్నింగిచ్చింది హన్సిక.

“అయితే వాడెప్పుడెళ్తాడు...'' అన్నాను.

“తెలియదు..'' అన్నది.

రేపు మాపులు ఎన్నో గడిచిపోయినై. ప్రదీప్ స్టేట్స్ వెళ్లే సంగతేమోగాని హన్సిక మాత్రం నన్ను నిర్లక్ష్యం చేసి తనకి ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తోంది. ఈ మధ్య కాలంలో ఈమెకోసం అతను కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ వరకు రావటం కూడా జరుగుతోంది.

ఈ విషయాన్ని నా మిత్రులు కూడా కనిపెట్టారు. 'వాడి వాలకం చూస్తుంటే ఆస్ట్రేలియా వెళ్లేవాడిలా లేడురా? నీ లవర్‌ని బుట్టలో వేసుకోటానికే డాబులు కొడ్తున్నట్టుగా అన్పిస్తుంది..'' అంటూ తమ అనుమానాన్ని తెలియజేశారు. మరొకరెవ్వరైనా హన్సిక పేరు కూడా ఉచ్చరించటం భరించలేని నేను ఇలా నా ఫ్రెండ్స్ పరాచికాలాడే వరకు తెచ్చుకోవటం రక్తాన్ని ఉడికించేసింది. హన్సికతో ఆరోజు తాడో పేడో తేల్చుకోవాలనుకున్నాను.

ఇనిస్టిట్యూట్‌కి వెళ్లకుండా బయట్నుంచే కాపుగాసి అటుగా వస్తున్న తనని కలిసాను. పర్సనల్ పనుందంటూ కన్విన్స్ చేసి జనం తక్కువగా వుండేచోటుకి తీసుకెళ్లాను. ప్రదీప్ విషయంలో మా యిద్దరి మధ్య చాలా వాదన జరిగింది. ప్రతీమాటకి ఆమె ప్రదీప్‌నే వెంటేసుకురావటం నాకోపం నషాలానికంటేలా చేసింది.

“ఫైనల్‌గా చెప్తున్నా..! ఇంకోసారి అతగాడి బైక్‌మీద కన్పించావంటే ఇద్దరికీ బాగుండదు...'' అన్నాను.

“నేనేమైనా నువ్వు కట్టుకున్న పెళ్లాన్ననుకుంటున్నావా... నాయిష్టం వచ్చిన వాళ్లతో కలిసి తిరిగే స్వేచ్ఛ నాకుంది...నీకు చేతనైంది చేసుకో...'' అన్నది.

నాకు ఎంత వెర్రెక్కిందంటే ఆమెనక్కడికక్కడే గొంతు నులిమి చంపాలనిపించింది. ఆ రాత్రి బాగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను.

***


మర్నాడు నా ప్రవర్తన నాకే వింతగా వుంది. రూమ్‌లో స్నానం ముగించేసి రాకేష్ బైక్ తీసుకుని ఎప్పుడూ వెళ్లే హోటల్‌కి వెళ్లాను. మామూలుగా అయితే ఒక్కటే, కానీ ఆరోజు మూడు ఉప్మా అట్లు ఒకదానిపైన ఒకటి ఆకలి తెలీకుండా లాగించేశాను.

ఆపైన ఒక షాపుకెళ్లి గోనెసంచి, ప్లాస్టిక్ తాడు కొన్నాను. మధ్యాహ్నం వరకు అక్కడ ఇక్కడ గడిపాను. లంచ్‌టైమ్‌కి పావుగంట ఉందనగా హన్సిక రూమ్‌కి వెళ్లాను. ఆ సమయంలో హన్సిక తప్ప ఇంకెవ్వరు రారని నాకు తెలుసు. అందరికీ గుర్తుగా పెట్టే చోటునుంచి కీ తీసుకుని డోర్ తీసి కూర్చున్నాను. హన్సిక రావటంతోనే మాటల్లో పెట్టాలి. ఆమెని ఆదమరవనిచ్చి భోజనం అయ్యాక వంగి ప్లేట్లు కడుగుతున్నప్పుడో, లేక అద్దంలో మేకప్ అవుతున్నప్పుడో వెనుకనుంచి వెళ్లి నోట్లో కర్చీఫ్ కుక్కేసి ఆపైన గొంతుకి తాడు బిగించాలి.



## బేనజీర్‌గా సుస్మితా!

పాకిస్తాన్ మాజీ ప్రధాని స్వర్గీయ బెనజీర్ భుట్టో జీవితచరిత్ర ఆధారంగా హిందీ, ఇంగ్లీషు భాషల్లో ఓ సినిమా రూపొందబోతోందిట. ఆమధ్య ఇదే సినిమాలో బెనజీర్ పాత్రకి షబానా ఆజ్మిని తీసుకున్నట్టు వార్తలు కూడా వచ్చాయి. మరిప్పుడు ఏమైందో గానీ ఆ పాత్రని సుస్మితాసేన్ నటించే అవకాశాలున్నట్టు బాలీవుడ్ టాక్. అయితే బెనజీర్ చరిత్రతో సినిమా తీయడం కాబట్టి ఆమె పార్టీ పెద్దల నుంచి అనుమతి లభించాల్సి వుందిట. పర్మిషన్ రాగానే సినిమా మొదలవుతుందిట.



ఆమె గింజుకులాడి ప్రాణాలు వదిలేస్తుంది. తర్వాత ఆమె శవాన్ని గోనె సంచిలో కట్టి ఇంట్లో నుంచి సామాను తీసుకెళ్తున్నట్టు వెళ్లి బైక్‌మీద పెటాల్లి. టౌన్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగులో ఆ శవాన్ని కల పాలి. అదీ నా ప్లాన్!!

ఆమెకోసం మామూలుగానే వెయిట్ చేస్తున్నట్టు వుండాలని టీవి ఆన్ చేశాను. హఠాత్తుగా ఓ న్యూస్ ఛానల్ దగ్గర నా చూపు ఆగిపోయింది.

సరిగ్గా మాలాంటి జంటే అది...ప్రియురాలు వేరొకడితో తిరగటం చూడ లేక ఆమె ప్రియుడు ఏడాది కిందట ఆమెను హత్యచేసి గోతిలో పూడ్చిపె ట్టాడు. అదిప్పుడు బయటపడింది. దొరికిపోయిన నేరస్తుడ్ని పోలీసులు చూపిస్తున్నారు. మావాడు ఇంత దారుణానికి ఒడిగట్టినందుకు వాడికి తగిన శిక్ష పడాలనే కోరుకుంటున్నాం. వాడు మా కడుపున చెడబుట్టాడు అంటూ కన్నతల్లిదండ్రులే కడుపుతీపి చంపుకుని అతన్ని శాపనార్థాలు పెడుతు న్నారు. నా రెండు చేతుల బలం ముందు హన్సిక ప్రాణాలు గాల్లో కలిసిపో వటం ఖాయం. అదేం పెద్ద శ్రమకాదు. కాని... ఈ విషయం ఏదో ఒకనాడు బయటపడిందంటే ముందుగా పోలీసుల దృష్టికొచ్చేది నేనే.

టీవీలో కనిపిస్తున్న దృశ్యాలు...నేరగాడి ముఖంలోని అపరాధనాభావం నన్ను విచలితుడ్ని చేస్తుంటే హన్సికని చంపేయాలన్న నిర్ణయం ఆరోజుకి వాయిదా వేశాను.

***

నా భార్య నిశ్చయ నుండి ఫోన్. తనకేదో అవసరం అనిపిస్తే తప్ప నన్ను డిస్ట్రబ్ చెయ్యదు.

"హలో మేమ్! వాడ్డూయు వాంట్.." అన్నాను సెల్ ఆన్ చేసి.

"షాప్ కట్టేయటంతోనే ఇంటికొస్తారా..లేటా...?"

"దేనికో..?"

"మరేం లేదు.. నా ఫ్రెండొకామె చాలాకాలానికి కలిసింది. తనొక ప్రాబ్ల మ్‌లో వున్నది. మీరొస్తేగాని మాట్లాడ్డం కాదు" అన్నది.

విషయాన్ని పొడిగించే టైమ్‌లేక సరే అని కట్టేశాను. నిశ్చయది జాలి గుండె. ఇతరులేదైనా సమస్య చెప్పినపుడు దిక్కుతోచకపోతే నా సలహా కోసం ఎదురు చూస్తుంటుంది. పైగా ఆమెవరో చాలాకాలానికి కలిసిందం టుంది కాబట్టి పది నిముషాలు ముందే షాప్ కట్టేసి కారు ఇంటివైపు దూకిం చాను. బెల్ నొక్కటంతో నా శ్రీమతే డోర్ తీసింది. షూ విప్పుతూ ఆమె స్నేహితురాలు ఎవరైవుంటారోనని లోపలి హాల్‌లోకి చూశాను.

సోఫాలో కూర్చునున్న ఆ స్త్రీ....మరెవరో కాదు! గతంలో నా ప్రియు రాలు.... హన్సిక!!

***

హన్సిక ఇంతకాలం ఎక్కడుందో, ఏం చేస్తుందో నాకు తెలియదు. తెలు కోవాల్సిన అవసరం కూడా ఏర్పడలేదు.

నిశ్చయ ఆమె స్కూల్లో కలిసి చదువుకున్నారుట. అనుకోకుండా కలి సిందని చెప్పింది. తన భర్త నేనన్న విషయం హన్సిక కూడా ఇప్పుడే గ్రహిం చినట్టుంది. షాక్‌నుంచి తేరుకుని "అడ్రస్ తెలిసిందిగా...మళ్ళొకసారొస్తా లేవే..." అంటూ వెళ్లబోయింది. నా భార్య బలవంతాన ఆపింది.

"ఏవండీ! దీన్నెవడో ప్రేమించినట్టు నటించి మోసం చేశాడట. డబ్బు, బంగారం దోచుకుని నీకు దిక్కున్నచోట చెప్పుకో అన్నాడట. అదును చూసి వాడ్ని హతమార్చే వరకు నిద్రపోనని బొడ్లో కత్తి పెట్టుకుని తిరుగు తోంది... అంతపనే జరిగితే దీని భవిష్యత్తు ఏం కావాలి. మీరైనా నచ్చచె ప్పండి" చెప్పింది నా భార్య ఆవేదన నిండిన స్వరంతో.

సమాజంలో ఎన్నో మోసాల్ని, కపటాల్ని కళ్లతో చూస్తున్న వేదాంతిలా చలనం లేకుండా అయిపోయాను.

"మాట్లాడరేంటండీ..." నిశ్చయ హెచ్చరికతో తిరిగి ఈ లోకంలోకొ చ్చాను. నాముందు నిలబడే అర్హత లేనట్టు నా మొహంలోకి చూడలేక నిల బడి వుంది హన్సిక. నేను పెదవి విప్పకుండా బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా దగ్గరకి వెళ్లాను. ఆ వరుసలో కనిపించింది 2004 డైరీ...

ఆరోజున హన్సికని హతమార్చాలన్న ఆలోచన్నుండి వైదొలిగికా...

'శత్రువుని చంపేయాలనుకున్నపుడు దానికి తిథి, నక్షత్రం అవసరం లేదు...కానీ ఆ ఆలోచనని కొంతకాలం వాయిదా వేస్తే అంతకన్నా మెరుగైన పరిష్కారం కనిపిస్తుంది!?' నేను డైరీలో రాసుకున్న వాక్యాలివి. మౌనంగా వెళ్లి ఆ డైరీని నా భార్య చేతుల ద్వారా హన్సికకి అందజేశాను. నాకులాగే హన్సికలోనూ మార్పు రావాలని!!

★



## వజ్రాల బొమ్మ

చక్కని అలంకరణతో కనువిందు చేస్తున్న ఈ జపనీస్ బొమ్మని ఆమధ్య టోక్యోలో జరిగిన ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. 51.433 క్యారెట్లు, 881 వజ్రాలు కలిగిన ఈ బొమ్మ విలువ రూ. 4.2 కోట్లు!!

-తటవర్తి

